క్లుప్తంగా

అవకతవకలు వెలికితీయాలి



మాట్లాడుతున్న సాయికుమార్

నిజామాబాద్ సిటీ: బాపూజీ వచనాలయంలో జరిగిన అవకతవకలను బయటకు తీయాలని వచనాలయ పరిరక్షణ కన్వీనర్ కోనేరు సాయి కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాపూజీ వచనాలయ సంస్థను ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించలేదన్నారు. పాలకవర్గంలోని కొందరు తమకు అనుకూలంగా బైలాస్‌లు సృష్టించారన్నారు. వచనాలయానికి చెందిన రూ.80 లక్షలను దుర్వినియోగం చేశారన్నారు. పాలకవర్గంలో సారా కాంట్రాక్టర్లు చేరి వ్యవస్థను నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన వచనాలయం కబ్జాదారుల నుంచి కాపాడాలని కోరారు. సమావేశంలో బంగారు సాయిలు, సిద్ధం రాజేందర్ అన్వర్‌ఖాన్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

జక్రాన్‌పల్లి: రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నిర్మించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని అన్నారు. యూనివర్సిటీలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలన్నారు. ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం సిగ్గుచేటని అన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ ఏరియా కార్యదర్శి మమత, మండల నాయకులు అభినయ్, భీమ్‌రావు, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత



ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలో నిర్వహించే సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి ఆహ్వానపత్రికను శుక్రవారం అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చౌహన్ మోహన్ నాయక్, విఠల్ నాయక్, రవి నాయక్, సరిచంద్ నాయక్, భుక్యా రమేశ్ నాయక్, హంసర్ నాయక్, వసంత్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు కొలతలు



కొలతలు వేస్తున్న అధికారులు

ధర్పల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి అధికారులు శుక్రవారం కొలతలు నిర్వహించి భూమి పూజ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా గృహ నిర్మాణ సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ప్రభు, అసిస్టెంట్ ఇంజినీర్ సత్యనారాయణ ఇందిరమ్మ మోడల్ హౌస్‌కు మార్కింగ్ వేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో రాజేశ్ పాల్గొన్నారు.

బినోల విద్యార్థినికి అభినందన

నిజామాబాద్‌అర్బన్: నవీపేట మండలం బినోల ఉన్నత పాఠశాల విద్యార్థిని కన్నం భవానిని డీఈవో అశోక్, హెచ్‌ఎం అభినందించారు. ఇటీవల ఆమె ప్రధాని మోదీ పరీక్షా పే చర్చలో పాల్గొంది. ఈకార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీని భవాని ప్రశ్న అడుగగా, స్పందించిన ప్రధాని జవాబు ఇచ్చారు. ఈసందర్భంగా విద్యార్థిని ప్రశ్నకు ప్రధాని సమాధానం ఇవ్వడంతో డీఈవో ప్రశంసించారు.

ఎన్నికల్లో ముదిరాజ్‌లకు ప్రాధాన్యత

- కల్యాణ మండప నిర్మాణానికి కృషి చేస్తా
- పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే



శోభాయాత్రగా పెద్దమ్మ ఆలయానికి వెళ్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యులు

డిచ్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులకు కాంగ్రెస్ పార్టీ తగిన ప్రాధాన్యత ఇస్తుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డిచ్‌పల్లి మండలం కొరట్‌పల్లిలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనదుర్గాదేవి(పెద్దమ్మ) ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముదిరాజ్ సంఘం సభ్యులు, మహిళలతో కలిసి ఎమ్మెల్యే ఊరేగింపుగా ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయం పక్కన అసంపూర్తిగా ఆగిపోయిన కల్యాణ మండప నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక జీవో ద్వారా గల్ఫ్‌బాధిత కుటుంబాలను ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. గల్ఫ్‌లో మరణించిన వారి కుటుంబానికి రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు తెలిపారు. 14 నెలల్లో సుమారు 60 మందికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పు గంగారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, సొసైటీ చైర్మన్ రాంచంద ర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, ఇమ్మడి గోపి, నాయకులు డాక్టర్ జహుర్, చిన్నారెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యులు పార్వతి గంగాధర్, హన్మాండ్లు, సాయన్న, సుకాంత్, రాకేశ్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

మోపాల్: మండలంలోని మంచిప్ప జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన అమరవీరులైన 40 మంది జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బేతాళ సాయిలు మాట్లాడుతూ.. భావితరాలు అమరవీరుల త్యాగాలు మర్చిపోలేవని అన్నారు. దేశం కోసం వీర మరణం పొందారని గుర్తుచేశారు. 2019లో జమ్మూకశ్మీర్‌లో పుల్వామాలో ఉగ్రవాదులు దాడి చేశారని, 40 మంది జవాన్లు అమరులయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయుడు సాయిరాం, సత్యనారాయణ, జగదీశ్, చిన్నోల్ల శ్రీధర్, దేవిదాస్, ఉపాధ్యాయులు ప్రవీణ్, దేవేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమాలకు దిక్సూచి యాదగిరి



సంతాప సభలో మాట్లాడుతున్న వనమాల కృష్ణ

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ప్రజా ఉద్యమాలకు సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు యాదగిరి దిక్సూచి లాంటివాడని పార్టీ జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం యాదగిరి సంతాప సభను పార్టీ నిజామాబాద్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో డిచ్‌పల్లిలో నిర్వహించారు. యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన యాదగిరి కమ్యూనిస్టు శ్రేణులకు ఆదర్శమన్నారు. ఆయన మరణం పీడిత ప్రజలకు తీరని లోటన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వెంకన్న, సాయన్న, అల్గోట్ రవీందర్, సుధాకర్, కిషన్, మురళి, లలిత, సాయిబాబా, మోహన్, గణేశ్, సాయిరెడ్డి, రాందాస్, అశోక్, ఇంతియాజ్, శ్రీను, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్ర వాతావరణంలో వంటలు చేయాలి

- అదనపు కలెక్టర్ అంకిత్



గిరిజన బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్

ఆర్మూర్: పరిశుభ్ర వాతావరణంలోనే విద్యార్థుల కోసం వంటలు చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) అంకిత్ సూచించారు. పట్టణంలోని పలు గురుకుల పాఠశాలలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, హౌసింగ్ బోర్డులోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, పిప్రి రోడ్డులోని ఆర్మూర్, వేల్పూర్ సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల, పాఠశాలలతో పాటు పెర్కిట్‌లోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో వంటలను పరిశీలించి, వండుతున్న విధానాలను తెలుసుకొని సూచనలిచ్చారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రాజు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ గంగామణి ఉన్నారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యం



అదనపు విద్యుత్ అనుసంధానాన్ని ప్రారంభిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్

బోధన్‌రూరల్ : నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరానే టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ లక్ష్యమని విద్యుత్ శాఖ ఎస్ఈ ఆర్ రవీందర్ అన్నారు. బోధన్ మండలంలోని సంగం గ్రామంలో రుద్రూర్ ఫీడర్ (సబ్ స్టేషన్) నుంచి విద్యుత్ సరఫరా లైన్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రుద్రూర్‌లో రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన 33 కేవీ నుంచి సంగం సబ్‌స్టేషన్‌కు విద్యుత్ లైన్‌ను అనుసంధానం చేశామన్నారు. ప్రతిఒక్కరూ విద్యుత్‌ను అవసరం మేరకు పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యుత్ సమస్యలు, ఇబ్బందులు ఉంటే స్థానిక విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమాచారం అందించి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ డీఈ రమేష్, బోధన్ డీఈ ఎండీ ముక్తార్, ఏడీఈ నగేష్, రాజశేఖర్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే భూములు సారవంతం



మాట్లాడుతున్న కేవీకే కోఆర్డినేటర్ అంజయ్య

కమ్మర్‌పల్లి: రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తే భూములు సారవంతంగా మారాతాయని రుద్రూర్ కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అంజయ్య పేర్కొన్నారు. దీంతో క్రిమిసంహారక, అవశేషాలు లేని ఆరోగ్యకరమైన ఆహారం పొందగలుగుతామని తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో పురుగుల మందులు, ఎరువుల వినియోగం తగ్గడంతో పంట సాగు ఖర్చులు తగ్గుతాయని తెలిపారు. ఆవు పేడ, మూత్రంతో జీవామృతం, ద్రవ, ఘన జీవామృతం, బ్రహ్మాస్త్రం, అగ్ని అస్త్రం వంటి పంటను నాశనం చేసే పురుగు మందులు తయారవుతాయని వెల్లడించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. రైతులు కిసాన్ సారథి టోల్ ఫ్రీ నంబర్ 18001252175కు కాల్ చేసి తమ సమస్యలను తెలిపితే శాస్త్రవేత్తలు పరిష్కార మార్గాలు చూపుతారని తెలియజేశారు. ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ బి. రాజ్‌కుమార్, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ శ్వేత, సేద్య శాస్త్రవేత్త ఎస్. స్వప్న, మండల వ్యవసాయాధికారి రమ్యశ్రీ, ఏఈవోలు వినయ్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సుభాష్‌నగర్: నగరంలోని వినాయక్‌నగర్ సబ్‌స్టేషన్ ఆర్యనగర్–1 ఫీడర్‌లో చెట్ల కొమ్మలు నరికివేత కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏడీఈ పి వీరేశం శుక్రవారం పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాయత్రినగర్ రోడ్ నంబర్ 1, 2, 3, 4, 5, ఆకుల పాపయ్య కాలనీ, చింత చెట్టు మైసమ్మ, కాశీనగర్, సిద్ధి వినాయక రోడ్, ఆర్యవైశ్య సంఘం, సాయికృపనగర్, న్యాల్‌కల్ రోడ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

టౌన్–1, 2 ఏడీఈ పరిధిలో..

నగరంలోని న్యూహౌసింగ్ బోర్డ్, పవర్ హౌస్ కాంపౌండ్ సబ్‌స్టేషన్ల పరిధిలో నెలవారి నిర్వహణలో భాగంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్–1, 2 ఏడీఈలు ఆర్ చంద్రశేఖర్, ఆర్ ప్రసాద్‌రెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రేపు ప్రత్యేక పూజలు

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని బోర్గాంలో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో ఆదివారం సంకష్ట చతుర్థిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు టి అరుణ్‌కుమార్‌శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఆలయంలో నిర్వహించే పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు సంత్ సేవాలాల్ జయంతి

నిజామాబాద్ రూరల్: దేశ వ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది బంజారాలు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్‌ను ఆరాధ్య దైవంగా కొలుస్తారు. గిరిజన తండాలలో ఉన్న సేవాలాల్ మహరాజ్ ఆలయాలు నిత్యం సేవాలాల్ నామస్మరణతో మార్మోగుతుంటాయి. ఈక్రమంలో నేడు సేవాలాల్ జయంతి సందర్భంగా గిరిజనులు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆలయాల్లో భోగ్‌బండార్, పాయసంతో నైవేద్యం సమర్పించి ఆయురారోగ్యాలు, సకల సంపదలు ఇవ్వాలని కోరుకుంటారు. సేవాలాల్ జయంతి రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని పలువురు కోరుతున్నారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు హాజరైన కాంగ్రెస్ నేతలు



ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ధర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల గణన, ఎస్సీ వర్గీకరణలపై హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ధర్పల్లి మండల నాయకులతో పాటు జిల్లాస్థాయి నాయకులు హాజరయ్యారు. ఈ ప్రజెంటేషన్‌లో సమగ్ర సమాచారం ఉందని ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సరి కాదని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమానికి ఇందల్వాయి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి చెల్లెల నర్సయ్య పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీ మాలలను నట్టేట ముంచింది'



బోధన్‌లో మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి రవి

బోధన్ : కాంగ్రెస్ పార్టీ మాలలను నట్టేట ముంచిందని, ఆ పార్టీని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిస్తామని మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నీరడి రవి అన్నారు. పట్టణంలోని శక్కర్‌నగర్‌లో హరిజన సుధార్ సమితి, మాల సంఘం నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ ఏక సభ్య కమిషన్ నివేదిక ప్రతుల దగ్ధం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని వీడి మాలలు బయటకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు డివిజన్ ఉపాధ్యక్షుడు కారం స్వామి, హరిజన సుధార్ సమితి ప్రతినిధులు పెరక స్వామి, పల్నాటి యాదగిరి, నీరడి అశోక్, బాలకృష్ణ, మల్లేశం, కాపర్ల స్వామి, శ్రీనివాస్, లక్ష్మణ్, కేశవ్, లింగాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించేది ఎప్పుడో?

- నాలుగు నెలల క్రితం కూలిన స్విమ్మింగ్‌పూల్ ప్రహరీ
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్విమ్మింగ్ పూల్ ఆవరణ గోడ కూలి నాలుగు నెలలు గడుస్తోంది. అయినా అధికారులు నిర్మాణ పనులు చేపట్టలేదు. దీంతో స్విమ్మింగ్‌పూల్‌కు వచ్చే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వేసవి కాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో స్విమ్మింగ్ పూల్‌లో మూడు నెలల పాటు పిల్లలు, పెద్దలు స్విమ్మింగ్ చేసేందుకు వస్తుంటారు. అంతేకాకుండా స్కేటింగ్ కోర్టు కూడా ఉండడంతో చిన్నారులు అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తారు. గత వర్షాకాలంలో 2024అక్టోబర్22న స్విమ్మింగ్‌పూల్ ప్రహరీ కూలి పోయింది. దీంతో నాటి నుంచి దానిని పట్టించుకున్న వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది.

రూ. 15 లక్షల నిధులు అవసరం

ప్రభుత్వ కార్యాలయాల్లో ఏవైనా పనులు చేపట్టాలంటే కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టాలి. స్విమ్మింగ్ పూల్ ఆవరణ నిర్మాణానికి సంబంధించి జిల్లా యువజన క్రీడల అధికారి ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే రూ. 15లక్షల నిధులు అవసరం అవుతువందని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీంతో అంత బడ్జెట్ లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. నిధులు లేకపోవడంతో రూ.లక్షా20వేలతో ప్రీ కాస్ట్ గోడను నిర్మించడానికి జిల్లా యువజన క్రీడల అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తాత్కాలికంగా ఇబ్బందులు రాకుండా ఉండేందుకు చర్యలు చేపడుతున్నారు.

ప్రీ కాస్ట్‌తో తాత్కాలిక గోడ ఏర్పాటు

నిధులు లేకపోవడంతో ప్రీకాస్ట్‌తో తాత్కాలికంగా గోడను ఏర్పాటు చేస్తాం. రెండు రోజుల్లో పనులను ప్రారంభిస్తాం. నిధులు వచ్చిన తర్వాత ఇటుకలతో గోడను నిర్మిస్తాం.

– ముత్తెన్న, జిల్లా యువజన క్రీడల అధికారి



స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో కూలిన గోడ ప్రాంతం

ఘనంగా తల్లిదండ్రుల ఆరాధన దినోత్సవం



ఆర్మూర్‌లో ఆరాధన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆర్మూర్: పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల శ్రీ సరస్వతీ విద్యా మందిర్ పాఠశాలలో తల్లిదండ్రుల ఆరాధన దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణతో కూడిన విలువలు నేర్పే పాఠశాలలు శిశు మందిరాలని వక్తలు కొనియాడారు. శిశు మందిరాల్లో మాత్రమే తల్లిదండ్రుల విలువల్ని తెలుపుతూ, మన ఆచారాలను తెలిపే విధివిధానాలు నేర్పుతున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులకు పాద సేవ చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన మల్లన్న ఉత్సవాలు

బాల్కొండ: మండల కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహించిన మల్లన్న ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. మల్లన్న గుట్ట వద్ద నుంచి రథంను గ్రామంలోకి తీసుకువచ్చి ప్రధాన వీధుల్లో తిప్పారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్టీఏ సభ్యులతో మంత్రి సమావేశం



నరేందర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఖలీల్‌వాడి: ఆర్టీఏ సభ్యుడి(నాన్ అఫీషియల్)గా నియామకమైన ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజనరేంద ర్‌గౌడ్‌ను రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్‌లో సన్మానించారు. శుక్రవారం కొత్తగా నియామకమైన ఆర్టీఏ సభ్యులతో సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి సమావేశం నిర్వహించారు. రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చిల్డ్రన్ రోడ్ సేఫ్టీ అవేర్నెస్ పార్క్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రస్తుతం రవాణ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలు, ట్రాఫిక్ అవేర్నెస్ కార్యక్రమాలు తదితర అంశాలను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ సభ్యులకు అవగాహన కల్పించారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	89,300	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	82,230		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	120
స్కిన్‌లెస్	220	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	80	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	110
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	30	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: చావా(హిందీ)- 11.00, 1.40, 10.20; తండేల్(తెలుగు)-4.35, 7.30
- స్క్రీన్-2: లైలా(తెలుగు)-11.00,1.40,7.20, 10.20; చావా(హిందీ)-4.30
- స్క్రీన్-3: బ్రహ్మ ఆనందం(తెలుగు)-11.00, 4.30; ఆరెంజ్(తెలుగు)- 1.40; కెప్టెన్ అమెరికా(తెలుగు)-4.30; తండేల్(తెలుగు)- 10.25

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: కెప్టెన్ అమెరికా(తెలుగు)-10.45, 7.20; లైలా(తెలుగు)-1.25; తండేల్(తెలుగు)-4.15, 10.00
- స్క్రీన్-2: చావా(హిందీ)-10.00, 4.00, 10.25; కెప్టెన్ అమెరికా(3డీ తెలుగు)-1.20; తండేల్(తెలుగు)-7.25
- స్క్రీన్-3: తండేల్(తెలుగు)-10.30; నిదురించు జహాపన(తెలుగు)-1.35; లైలా(తెలుగు)-4.10; చావా(హిందీ)-7.00; సనమ్ తేరి కసమ్(హిందీ)-10.20
- స్క్రీన్-4: తల(తెలుగు)-10.55; సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.35, 7.40 - బ్రహ్మ ఆనందం(తెలుగు)-4.35; లైలా(తెలుగు)-10.40

లలితామహల్	తండేల్(తెలుగు)
దేవి	లైలా (తెలుగు)
నటరాజ్	చావా(హిందీ)
విజయ్	సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)